క్లుప్తంగా

ఏఓగా లావణ్య బాధ్యతల స్వీకరణ



జహీరాబాద్‌: జహీరాబాద్‌ మండల వ్యవసాయాధికారిగా లావణ్య మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఏఓగా పని చేసిన ప్రవీణ చౌటకూర్‌ మండలానికి బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో న్యాల్‌కల్‌ ఏఓగా ఉన్న లావణ్య జహీరాబాద్‌కు బదిలీపై వచ్చారు.

సామాజిక కార్యక్రమాలు చేపట్టాలి



పోలీసులకు బారికేడ్లను అందజేస్తున్న బిల్డర్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని కొల్లూర్‌ ఇన్‌స్పెక్టర్‌ రవీందర్‌ పిలుపునిచ్చారు. మంగళవారం ముప్పా బిల్డర్స్‌ కొల్లూర్‌ పోలీస్‌స్టేషన్‌కు 10 బారికేడ్స్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెల్లాపూర్‌ నైబర్‌హుడ్‌ అసోసియేషన్‌ కోశాధికారి రవి రమణ, ముప్పా ప్రాజెక్టు జీఎం రాజశేఖర్‌, ఎస్‌ఐలు రమేష్‌, సురేష్‌లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని మెదక్‌ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం భారతినగర్‌ డివిజన్‌ పరిధిలోని హెచ్‌ఐజీ కాలనీలోని వ్యాపారవేత్త అరవ రామకృష్ణ నివాసానికి వచ్చిన సందర్భంగా కాలనీ ప్రతినిధులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఎంపీ వారికి హామీ ఇచ్చారు.

బీటీ రోడ్డు ప్రారంభం



బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ విజయలక్ష్మి

సంగారెడ్డి : పట్టణంలోని 28వార్డు చాణక్యపురి కాలనీలో టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్‌ నిర్మలారెడ్డి సహకారంతో రూ.40 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మంగళవారం ఆ రోడ్డును మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ విజయలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ ఉమామహేశ్వరి, సంతోష్‌, ప్రదీప్‌, జార్జి, కిరణ్‌ గౌడ్‌, మహేష్‌, శ్రీకాంత్‌ గౌడ్‌ పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన



రైతునేస్తంలో పాల్గొన్న అధికారులు, రైతులు

రాయికోడ్‌(అందోల్‌): స్థానిక రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు మంగళవారం పంటలసాగుపై వీసీ ద్వారా రైతులకు సూచనలు చేశారు. రైతులు సాగుచేస్తున్న పత్తి, వరి పంటల యాజమాన్య పద్ధతులను వివరించారు. దిగుబడులు ఆశించిన మేర వచ్చేలా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి సారిక, ఏఈఓలు యాదయ్య, శివకుమార్‌, మల్లేశం, రైతులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



కోలాటం ఆడుతున్న చిన్నారులు

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): మండల పరిధిలోని నిజాంపూర్‌(కె) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు నవనీత, సునీత, సీఆర్పీ నాగేష్‌ పాల్గొన్నారు.

ప్రకృతి వనంలో పిచ్చిమొక్కలు



పట్టణ ప్రకృతి వనంలో పెరిగిన పిచ్చి మొక్కలు

సంగారెడ్డి క్రైమ్‌ : జిల్లా కేంద్రంలోని ప్రకృతి వనం నిండా పిచ్చిమొక్కలు నిండిపోయాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం చేపట్టినా అధికారులు ఈ ప్రకృతి వనం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ప్రజల వినియోగానికి ఏ మాత్రం వీలు లేని ఈ వనం జిల్లా జడ్జి భవనం పక్కనే ఉండటం విశేషం. కుక్కలకు, పశువులకు ఆవాసంగా మారిన పట్టణ ప్రకృతి వనాన్ని అధికారులు ఇప్పటికైనా శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా హోర్డింగ్‌ బ్యానర్లు



హూర్డింగ్‌ పై వేలాడుతున్న బ్యానర్లు

సంగారెడ్డి క్రైమ్‌ : జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న భారీ హోర్డింగులు ప్రమాదకరంగా ఉన్నాయి. పట్టణంలో 20 నుంచి 50 వరకు హోర్డింగులు ఉన్నాయి. అయితే ఈ హోర్డింగులకు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈదురు గాలులకు చిరిగి వాహనదారులపై పడుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. హోర్డింగుల ద్వారా వచ్చే ఆదాయమే అధికారులు చూసుకుంటున్నారు కానీ, ప్రజల భద్రతను గాలికి వదిలేస్తున్నారు. హోర్డింగులపై చిరిగిపోయి ఉన్న బ్యానర్లను తొలగించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మహనీయుని వనం.. అస్తవ్యస్తం



అంబేడ్కర్‌ వనంలో పెరిగిన చెట్లు, ముళ్లపొదలు

సంగారెడ్డి క్రైమ్‌ : సంగారెడ్డి పట్టణ శివారులోని సదాశివనగర్‌, కులబ్‌గూర్‌ గ్రామ పంచాయతీకి ఆనుకొని ఉన్న మహనీయుడు డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ వనం అస్తవ్యస్తంగా మారింది. ఎటు చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తుంది. అంబేడ్కర్‌ విగ్రహం చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగి విష సర్పాలకు ఆవాసంగా మారింది. వనం పరిశుభ్రతను అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

కవితకు బెయిల్‌పై సంబురాలు



జహీరాబాద్‌లో..



నారాయణఖేడ్‌: సంబురాల్లో బీఆర్‌ఎస్‌ నాయకులు

నారాయణఖేడ్‌: బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్‌ మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ నారాయణఖేడ్‌లో మంగళవారం బీఆర్‌ఎస్‌ నాయకులు సంబురాలు చేసుకున్నారు. పట్టణంలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు.

సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులు అందజేత



వట్‌పల్లి(అందోల్‌): చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్‌ నేతలు

వట్‌పల్లి(అందోల్‌)/మునిపల్లి(అందోల్‌): సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను మంగళవారం వట్‌పల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్‌జోషి, పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, దిగంబర్‌రావు, అశోక్‌ గౌడ్‌, సుధాకర్‌ సార్‌, సంగారెడ్డి, పత్రి విట్టల్‌, శంకరప్ప, గోపాల్‌ రెడ్డి, విట్టల్‌, పెద్దన్న, వెంకట్‌ పాటిల్‌, హబీబ్‌మియా, సత్యం, విష్ణు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రమైన మునిపల్లికి చెందిన మల్కాపూరం వంశీగౌడ్‌కు మంజూరైన రూ.50వేల చెక్కును నాయకుడు నరేందర్‌గౌడ్‌ అందజేశారు. రాజుపాటిల్‌, పరమేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పండగలా బీజేపీ సభ్యత్వ నమోదు

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పండగ వాతావరణంలో జరగాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దర్గీ సుధాకర్‌ అన్నారు. మంగళవారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో అత్యధిక సభ్యత్వాలు అయ్యే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్‌ రావు, నాయకులు అంబదాస్‌, సుభాష్‌, అశోక్‌, శ్రీకాంత్‌, మహేష్‌ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దర్గీ సుధాకర్‌

పొగాకు.. ఆరోగ్యానికి ముప్పు

హత్నూర (సంగారెడ్డి): పొగాకు ఉత్పత్తులను వినియోగించి ఆరోగ్యానికి ముప్పు తెచ్చుకోవద్దని నియంత్రణ విభాగం జిల్లా సూపర్‌వైజర్‌ విష్ణువర్ధన్‌ రెడ్డి అన్నారు. మంగళవారం హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, బస్టాండ్‌ పరిసరాలు, గ్రామ పంచాయతీ వద్ద అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్‌ రజిని, సూపర్‌వైజర్‌ పురుషోత్తం, కిషన్‌, వినోద, లక్ష్మణ్‌, రేఖ, ఉపాధ్యాయులు రమాదేవి, చంద్రయ్య, రామ్మోహన్‌ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారి

మరమ్మతుల పరిశీలన

పటాన్‌చెరు: డివిజన్‌ పరిధిలోని పాత తహసీల్దార్‌ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న రిజిస్ట్రేషన్‌ కార్యాలయ భవన మరమ్మతు పనులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. త్వరలో రిజిస్ట్రేషన్‌ కార్యాలయం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ మండల ఇన్‌చార్జిగా గోపాల్‌

జహీరాబాద్‌: రైతు హక్కుల సాధన సమితి మండల ఇన్‌చార్జిగా హోతి(కె)కి చెందిన గోపాల్‌ను నియమించినట్లు యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు సి.బాల్‌రాజ్‌ పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కార్యవర్గ సభ్యుడిగా గౌసొద్దీన్‌ను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్‌, జైపాల్‌, లాజర్‌, భాస్కర్‌ పాల్గొన్నారు.

◆ ఆక్రమణలు తొలగించండి

పటాన్‌చెరు టౌన్‌: బండ్లగూడ వార్డు 4లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన బాత్రూంలను తొలగించాలని బండ్లగూడ వాసులు కోరారు. మంగళవారం డిప్యూటీ కమిషనర్‌ సురేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా విద్యుత్‌ పోల్స్‌ ఏర్పాటు చేశారని వాటిని సైతం తొలగించాలని డీసీకి వినతిపత్రం అందజేశారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి జోన్‌: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28, 29వ తేదీల్లో నిర్వహించే క్రీడా పోటీలను జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలను స్థానిక డా.బీఆర్‌.అంబేడ్కర్‌ స్టేడియంలో నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు వాట్సాప్‌ 79817–98957, 73861–91141 నంబర్లకు వివరాలు పంపించాలని పేర్కొన్నారు.

◆ మద్యం మత్తులో వృద్ధురాలిపై అఘాయిత్యం

నారాయణఖేడ్‌: పట్టణంలో మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలి(60)పై యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వృద్ధురాలు ఓ దుఖాణం ఎదుట మంగళవారం రాత్రి పడుకొని ఉంది. పట్టణానికి చెందిన యువకుడు మద్యం మత్తులో మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మహిళ అరవడంతో స్థానికులు గమనించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలిని సందర్శించారు. సదరు అనుమానిత యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్‌ జేపీ కాలనీలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానంలో కృష్ణాష్టమి బ్రహ్మోత్సవాలు రెండో రోజు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ధర్మకర్త, కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌ యాదవ్‌, అర్చకులు మాట్లాడుతూ... బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం స్వామివారికి విశేష పంచామృత అభిషేకం, శ్రీ కృష్ణ మూల మంత్ర హోమం, కల్యాణ మహోత్సవం నిర్వహించినట్లు చెప్పారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పీసీబీ ప్రాజెక్ట్‌ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణంపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించే విధంగా కళాజాత నిర్వహిస్తున్నామని తెలిపారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌ తనిఖీలు



బ్రీత్‌ ఎనలైజర్‌ పరీక్షలు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్‌ టౌన్‌: పట్టణంలోని అల్గోల్‌ దారిలో బైపాస్‌ రోడ్డు వద్ద టౌన్‌ ఏఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించిన వాహనాల చోదకులకు బ్రీత్‌ ఎనలైజర్‌ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగిన బైక్‌లను నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు.

ముదిరాజ్‌ యువసేన కమిటీ ఎన్నిక

నారాయణఖేడ్‌: ఖేడ్‌ పట్టణ ముదిరాజ్‌ యువసేన యాక్షన్‌ కమిటీని పట్టణంలోని మంగపేటలోని ముదిరాజ్‌ భవన్‌లో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా నాగారం శ్రీనివాస్‌, అల్కారి సత్యనారాయణ సాయిలు, మూఢ రామకృష్ణ, మాసాని కృష్ణ, అవుటి శంకర్‌ ముదిరాజ్‌ ఎన్నికయ్యారు. యాక్షన్‌ కమిటీ సభ్యులుగా బుగుడాల రవికుమార్‌, శనిగారపు పరమేశ్వర్‌, శాతం కృష్ణ, మేకల శ్రీనివాస్‌, బాణాపురం శ్రీశైలం, శ్రీనివాస్‌, రవికుమార్‌, దిగంబర్‌, రాములు, నేతి రామచందర్‌, శ్రీనివాస్‌, గుణకర్‌, మేకల జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌ ఎన్నికయ్యారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

నారాయణఖేడ్‌: మున్సిపాలిటీలో పనిచేస్తున్న డ్రైవర్లు, కార్మికులకు వేతనాలను పెంచాలని మంగళవారం సీఐటీయూ ఖేడ్‌ ప్రాంత కార్యదర్శి రమేశ్‌ ఆధ్వర్యంలో డ్రైవర్లు, కార్మికులు కమిషనర్‌ జగ్జీవన్‌ను వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌ మాట్లాడుతూ ఇతర మున్సిపాలిటీల్లో డ్రైవర్లకు రూ.19,500 వేతనంగా చెల్లిస్తుండగా, ఇక్కడ అంతకన్నా తక్కువ చెల్లిస్తున్నారని తెలిపారు. పెరిగిన ధరలతో డ్రైవర్లు, కార్మికులకు వేతనాలు సరిపోక కుటుంబాలు గడిచే పరిస్థితి లేదన్నారు. వేతనాలను పెంచడంతో పాటు వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలన్నారు. సంఘం నాయకులు సతీష్‌, రవి, నాగయ్య, సాయిలు, గోపాల్‌, విఠల్‌, దినేష్‌, ఇస్మాయిల్‌, బాలరాజ్‌ పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం

పటాన్‌చెరు టౌన్‌: మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అని విభూది బ్రదర్స్‌ కళాజాత బృందం సభ్యులు పిలుపునిచ్చారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్‌ ఆదేశాల మేరకు మంగళవారం పటాన్‌చెరు బస్టాండ్‌ సమీపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలకు సిద్ధమవుతున్న వేళ గణపతి విగ్రహాన్ని చెరువు మట్టితో తయారు చేసి చెరువులోనే నిమజ్జనం చేయాలన్నారు. 10 రోజుల పాటు కళాజాత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీసీబీ ప్రాజెక్ట్‌ ఆఫీసర్‌ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

మహిళల రక్షణకే షీటీమ్స్‌

పటాన్‌చెరు టౌన్‌: మహిళల రక్షణ కోసమే షీటీమ్స్‌ ఉన్నాయని పటాన్‌చెరు ఎస్‌ఐ అంబరయ్య అన్నారు. మంగళవారం డివిజన్‌ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షీటీం, పోక్సో, మాదకద్రవ్యాలు, సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... షీటీం బృందాలు బస్టాండ్లు, విద్యాసంస్థల వద్ద మఫ్టీలో తిరుగుతూ మహిళలకు రక్షణ కల్పిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు అత్యవసరమైతే డయల్‌ 100కు కాల్‌ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మారెడ్డి ఉపాధ్యాయులు మోహన్‌ రఘుపతి, ధనరాజ్‌, షీటీం హెడ్‌ కానిస్టేబుల్‌ శివకుమార్‌, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ అంబరయ్య

చెత్తను తొలగించండి.. సారూ!



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

సంగారెడ్డి మున్సిపాలిటీలోని 4వ వార్డు పరిధిలో ఉన్న గంజి మైదానంలో చెత్త పేరుకుపోయిందని స్థానికులు తెలిపారు. చెత్త కారణంగా దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఇప్పటికైనా చెత్తను తొలగించాలని కోరారు

– సంగారెడ్డి రూరల్‌:

ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలి

- రాష్ట్ర ముదిరాజ్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ జ్ఞానేశ్వర్‌

వట్‌పల్లి (అందోల్‌): ముదిరాజులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ముదిరాజ్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ బి.జ్ఞానేశ్వర్‌ అన్నారు. మండల పరిధిలోని విద్యాల సర్వేశ్వరపురి క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన కొనర్వి కృష్ణమూర్తి జయంతి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముదిరాజ్‌ జెండా ఆవిష్కరించి అనంతరం ఆయన మాట్లాడుతూ జనాభాలో 17శాతానికిపైగా ఉన్న ముదిరాజ్‌ కులస్తులు గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా వెనుకబాటుతనాన్ని అనుభవిస్తున్నారన్నారు. చదువుకు దూరంగా ఉన్న ముదిరాజ్‌ యువత డ్రగ్స్‌ వంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించి ఉద్యోగ అవకాశాలను అందిపుచుకోవాలనేలా ప్రోత్సాహించాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్‌ మహాసభ పొలిట్‌ బ్యూరో సభ్యుడు బానిస నారాయణ, ఉపాధ్యక్షులు సఫాన్‌ దేవ్‌, కాంగ్రెస్‌ నాయకుడు రాజు, సర్వేశ్వర పుణ్యక్షేత్ర పీఠాధిపతి అంబిక శివయోగి, జిల్లా అధ్యక్షుడు తప్ప కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌

నూతన కార్యవర్గం ఎన్నిక

సంగారెడ్డి : చౌటకూర్‌ మండల కేంద్రంలో నాయీ బ్రాహ్మణ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు మహేష్‌, అధ్యక్షుడు గంగారం, ఉపాధ్యక్షుడు ప్రశాంత్‌, సభ్యులుగా మల్లేశం, రమేష్‌, వెంకటేశం, శంకరయ్య, రంగయ్య, కృష్ణ ఎన్నికయ్యారు.

ఎస్‌జీఎఫ్‌ పోటీలు షురూ

జహీరాబాద్‌ టౌన్‌: పట్టణంలోని ఎంఆర్‌హెచ్‌ఎస్‌ పాఠశాల మైదానంలో మండలస్థాయి స్కూల్‌ గేమ్‌ ఫెడరేషన్‌ (ఎస్‌జీఎఫ్‌) ఆటల పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బాలబాలికల అండర్‌ 14, 17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో మండలంలోని 25 ప్రభుత్వ, ప్రైవేట్‌, గురుకుల పాఠశాలల 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల విద్యాధికారి బస్వరాజ్‌ క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌ ఆటల పోటీలు జరిగాయి. మండలస్థాయి విజేత జట్లను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కబడ్డీ అండర్‌–17 విభాగంలో.. అల్గోల్‌ గురుకులం విద్యార్థులు గెలుపొందగా ఆదర్శ స్కూల్‌ విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. ఖోఖోలో అల్గోల్‌ గురుకులం విద్యార్థులు విన్నర్‌ కాగా ఆర్‌ఎల్‌ఆర్‌ విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. వాలీబాల్‌ పోటీల్లో.. అల్గోల్‌ గురుకులం విద్యార్థులు విజయం సాధించగా ఆదర్శ స్కూల్‌ విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. అండర్‌ 14 విభాగం ఖోఖో, వాలీబాల్‌లో అల్గోల్‌ గురుకులం విద్యార్థులు విజయం సాధించారు. కబడ్డీలో డాక్టర్‌ ఆర్‌ఎల్‌ఆర్‌ విద్యార్థులు గెలుపొందారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు తులసీరాం రాథోడ్‌, హనుమంత్‌ పవార్‌ తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్‌ టౌన్‌: క్రీడా జ్యోతిని ప్రారంభిస్తున్న ఎంఈఓ బస్వరాజ్‌

– ఝరాసంగం(జహీరాబాద్‌): ఈ నెల 29న హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌ చంద్‌ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రమైన ఝరాసంగం తెలంగాణ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌ రియాజొద్దీన్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.